వార్షిక క్రీడోత్సవాలు



వేడుకలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: డివిజన్ పరిధిలోని మయూరీనగర్ కాలనీలో ప్రైమ్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం వార్షిక క్రీడోత్సవాలు నిర్వహించారు. కార్పొరేటర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలు ప్రారంభించారు. , క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థులు ఆటలపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రైమ్ స్కూల్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, నాయకులు ఉన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి

రాయదుర్గం: గోపన్‌పల్లిలో శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని రామ్‌రతన్ ఆర్య సేవా సమితి ప్రతినిధులు కోరారు. గోపన్‌పల్లిలోని సర్వే నంబర్– 21లో మేళ్ల చెరువు అలుగు వరద కాలువను కాపాడి శ్మశానవాటిక చుట్టూరా ప్రహరీగోడ నిర్మించాలని కోరారు.గతంలో ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు ప్రారంభించి నిలిపివేశారని, కొందరు ఈ శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తూ, దాని ముందున్న స్థలంలో వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఏమి 'ట్రీ'

- శాంతినగర్ ట్రీ పార్కుకు భద్రత కరువు
- ఆకతాయిలకు అడ్డా..
- వాకింగ్‌ట్రాక్ ధ్వంసం .. విరిగిన బెంచీలు

హఫీజ్‌పేట్ : చందానగర్ పరిధి శాంతినగర్‌లోని జీహెచ్‌ఎంసీ ట్రీ పార్కు నిరుపయోగంగా మారింది. పార్కులో వాకింగ్‌ట్రాక్, టాయిలెట్లు, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఐతే పార్కు చెత్త చెదారంతో పచ్చదనం కరువై ఎడారిలా మారింది. చిన్నారుల ఆట వస్తువులు విరిగిపోయాయి. వాకింగ్‌ట్రాక్ పూర్తిగా ధ్వంసమయ్యింది. పార్కులో ఉన్న విద్యుత్ మీటర్ తుప్పుపట్టి ప్రమాదకరంగా మారింది. ఇక రాత్రి సమయాలలో ఆకతాయిలు పార్కులో అసంఘటిత కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. మద్యం సేవించి ఇష్టానుసారంగా పార్కులోని వస్తువులను ధ్వంసం చేస్తున్నారని తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



తుప్పుపట్టిన విద్యుత్ మీటర్



చందానగర్‌లోని శాంతినగర్ ట్రీ పార్కు

పార్కును పట్టించుకోవాలి



జీహెచ్‌ఎంసీ ట్రీ పార్కు పట్టింపు లేక ఎడారిలా మారింది. జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కులో పచ్చదనం పెంపుపై చర్యలు తీసుకోవాలి. అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులు నిఘా ఉంచాలి. – సలీం, శాంతినగర్‌వాసి

ఆకతాయిలకు అడ్డాగా..



శాంతినగర్‌లోని ట్రీ పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రిపూట మద్యం తాగి పార్కులో ఉన్న సిమెంట్ బెంచీలను ధ్వంసం చేస్తున్నారు. పార్కులోకి రావాలంటే స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించాలి.

–నవీన్, శాంతినగర్‌వాసి



ఎండిపోయిన పార్కు



విరిగిపోయిన సిమెంట్ బెంచీలు



నిరుపయోగంగా టాయిలెట్స్

ఒడిశా ఆహార, సాంస్కృతిక ఉత్సవాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న స్వాభిమాన ఒడియా పరివార్ హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన చేనేత హస్తకళా, ఫుడ్ సాంస్కృతిక కార్యక్రమాలను శనివారం రెండవరోజు ఘనంగా నిర్వహించారు. ఒడిశా కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గవర్నర్ తమిళిసై, డి.కే మహంతి, మాజీ ఐఏఎస్ బీపి ఆచార్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై కళాకారులను అభినందించారు. సాంప్రదాయ వంటకాల గురించి అడిగి తెలుసుకున్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు



గచ్చిబౌలి: మాజీ మంత్రి, టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావుతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ నాయకత్వంలో నియోజకవర్గంలోని కార్పొరేటర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో పార్టీ సత్తాను మరోసారి చాటడమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్‌పటేల్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, రోజాదేవి, మంజులా రఘునాథ్‌రెడ్డి, సింధూ ఆదర్శ్‌రెడ్డి ఉన్నారు.

సైన్స్ ఫలాలను ప్రజలకు అందించడమే లక్ష్యం

- హెచ్‌సీయూ ప్రొఫెసర్ జయానంద
- భూవిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు



అప్పోజిగూడ, చందానగర్ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీయూ భూవిజ్ఞాన కేంద్రం బృందం

రాయదుర్గం: వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడుగంటిపోతున్న భూగర్భజలాలు, వనరులు మానవ జీవితాన్ని దుర్భలంగా మారుస్తున్నాయని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్(భూవిజ్ఞాన కేంద్రం)కు చెందిన ప్రొఫెసర్ జయానంద, ఆచార్యులు చక్రవర్తి, డాక్టర్ రాము, డాక్టర్ శ్రీలక్ష్మీ, డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ అలీబా, పరిశోధక విద్యార్థుల బృందం పలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయానంద మాట్లాడుతూ వైజ్ఞానిక రంగానికి సామాన్య ప్రజానీకానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం ద్వారా సైన్స్ ఫలాలను ప్రజలకు త్వరితగతిన అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అప్పోజిగూడ, చందానగర్ గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఆయా గ్రామాలలోని రైతులకు మొదటగా వ్యవసాయం మీద వాతావరణ మార్పుల ప్రభావంపై వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వాతావరణ మార్పుల గురించి వాటిని తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అంతేకాకుండా విద్యార్థులకు పర్యావరణ సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి అత్యుత్తమంగా రాణించిన వారికి బహుమతులు అందించారు.

ఆటో బోల్తా..ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

మరో ముగ్గురికి స్వల్ప గాయాలు



పటాన్‌చెరు టౌన్: ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇంద్రేశం కొత్త కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ మోహన్ శనివారం పోచారం సమీపం నుండి ఇంద్రేశం వైపునకు ఆటోలో చెత్త తీసుకెళ్తున్నాడు. అయితే ఇదే ఆటోలో ఆ కాలనీకి చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులను ఎక్కించుకొని వెళ్తుండగా పటాన్‌చెరు మండలం పోచారం సర్వీస్ రోడ్డు మీదగా ఇంద్రేశం వైపు వస్తుండగా సర్వీస్ రోడ్‌లో డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తాపడడంతొట డ్రైవర్ మోహన్‌తో పాటు స్వప్న, మొగులమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి అయితే వీరి పిల్లలు ఐదు నెలల వినయ్, తొమ్మిది నెలల ప్రశాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హెచ్‌సీయూ ప్రొ.వెంకట్‌రావు ఉద్యోగ విరమణ సభ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ పి వెంకట్ రావు పదవీవిరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హెచ్‌సీయూ డాక్టర్ జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ జ్యోతిర్మయిశర్మలు వెంకట్ రావును ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, పరిశోధక విద్యార్థులు ఆయనను పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే లెక్చర్ హాల్‌లో ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా పలు ఉన్నత విద్యాసంస్థలకు చెందిన 60 మంది పరిశోధక విద్యార్థులు జీవావరణ శాస్త్రం, వ్యవసాయం, ఆరోగ్యం, శ్రేయస్సు, పట్టణీకరణ, గిరిజన అభివృద్ధి, దేశీయ పరిజ్ఞానం, విద్య వంటి విభిన్న రంగాలపై తమ పరిశోధనా అంశాలతో కూడిన ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ అభివృద్ధికి కృషి



డా.చంద్రశేఖర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

- టీఎస్‌ఎఫ్‌డీసీ ఎండి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి
- వాకర్స్‌తో సమావేశం

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్ చుట్టూ ఫుట్‌పాత్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, టీఎస్‌ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబీఆర్ పార్క్ మాదిరిగా బొటానికల్ గార్డెన్‌కు రెండు వైపులా ఫుట్‌పాత్‌ను అభివృద్ధి చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ప్రధాన రహదారి వెంట గేటు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, గార్డెన్ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటానని తెలిపారు. రోజురోజుకు వాకర్స్ సంఖ్య పెరుగుతుందని, సమీప కాలనీల నుంచి వాకర్స్ వచ్చే విధంగా కేబీఆర్ పార్క్ మాదిరిగా అభివృద్ధి చేస్తే పార్కింగ్ సమస్య ఉండదని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో మహిళలకు పెద్ద పీట

పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్



శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి నల్లగండ్ల నుంచి చేవెళ్ళ నియోజకవర్గస్థాయి మహిళా కాంగ్రెస్ రివ్యూ సమావేశానికి తరలివెళ్తున్న మహిళల వాహనాన్ని జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ మంత్రి వర్గంలో మహిళలకు సముచిత స్థానం కల్పించిందని, ఎన్నికల హామీలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి మహిళా నాయకులు, కార్యకర్తలు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ఆదిత్యమౌర్యకు గోల్డ్ మెడల్



మియాపూర్: బెంగుళూరులో నిర్వహించిన ఖేలో ఇండియా ఆర్‌ఎస్‌ సదరన్ ఓపెన్ టాలెంట్ హంట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మియాపూర్‌కు చెందిన మహంకాళీ అదిత్య మౌర్య గోల్డ్ మెడల్ సాధించాడు. మియాపూర్ వశిష్ట జూనియర్ కళాశాలలో ఆదిత్య చదువుతున్నాడు. బెంగుళూర్‌లో నిర్వహించిన పోటీలలో 80 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. కళాశాల చైర్మన్ ప్రమీలారాణి, కోచ్‌లు నాగరాజు, హరీష్, కార్తీక్ అభినందించారు.

విద్యుత్ మీటర్‌కు ఫోన్ నంబర్ లింక్ ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ పథకాల్లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుపై శనివారం కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీ వీరాంజనేయ శివాలయంలో మీటర్ నంబర్‌కు ఫోన్ అనుసంధానం కార్యక్రమంను ప్రారంభించారు. బస్తీవాసులు మీటర్‌కు ఆధార్, తెల్ల రేషన్‌కార్డు నెంబర్‌తో ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేసుకున్నారు.

విద్యుత్ అధికారుల పర్యటన



సమస్యలను పరిశీలిస్తున్న సీజీఎం ఆనంద్, ఎస్‌ఈ వెంకన్న తదితరులు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ విద్యుత్ సెక్షన్‌లోని సాయినగర్ కాలనీలో శనివారం సీజీఎం పి.ఆనంద్, సైబర్‌సిటీ ఎస్‌ఈ వెంకన్న పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ సమస్యలు, గృహజ్యోతి పథకంపై ఆరా తీశారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. ఈ పర్యటనలో గచ్చిబౌలి డీఈ గోపాలకృష్ణ, ఏడీఈ శ్యాంప్రసాద్, ఏఈ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 గ్యారంటీలు అమలయ్యేవరకు పోరాటం

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు ప్రజలకు దక్కేవరకు పోరాటం చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశంలో చెప్పారని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్ కార్యాలయంలో కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో కేటీఆర్ ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని, కాంగ్రెస్‌ను అడ్డుకోవటం ఎవరితరం కాదని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని మంత్రికుంట గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో 50మంది బీఆర్ఎస్ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజుగౌడ్, సీతారాంసింగ్, కిషోర్‌సింగ్, కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు లేక నిత్యం ప్రమాదాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్లే రోడ్డులో విద్యుత్ దీపాలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రేడియల్ రోడ్డుని అభివృద్ధి చేసి రోడ్డు పక్కన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.



గ్రీన్ జోన్‌లో మాత్రమే విక్రయాలు జరపాలి

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: వీధి వ్యాపారులు అధికారులు సూచించిన గ్రీన్ జోన్ ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకోవాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో వీధి వ్యాపారులు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఉండే గ్రీన్ జోన్ ప్రాంతాలను డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సుస్మిత, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ వెంకట్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సోమేష్, ప్రాజెక్టు ఆఫీసర్ ఇంద్రసేన్, సంబంధిత అధికారులతో కలిసి శనివారం స్థానిక కార్పొరేటర్ పరిశీలించారు.

యూరోనిక్స్ కార్పొరేట్ క్రికెట్ లీగ్ జర్సీ ఆవిష్కరణ



గచ్చిబౌలి: యూరోనిక్స్ కార్పొరేట్ క్రికెట్ లీగ్ జర్సీని ఆవిష్కరించారు. శనివారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో యూరోనిక్స్ కార్పొరేట్ క్రికెట్ లీగ్ సీజన్–2 జర్సీని విడుదల చేశారు. కార్పొరేట్ క్రికెట్ లీగ్‌లో విభిన్న జట్లకు ఆతిథ్యం ఇస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆర్కిటెక్ట్‌లు, బిల్డర్లు, ఎంఈపీ కన్సల్టెంట్లు, ఇంటీరియర్ డిజైనర్లు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కంపెనీల క్రికెట్ జట్లు పోటీపడనున్నాయి.

క్వీర్ కార్నివాల్



ప్రదర్శనను తిలకిస్తున్న సినీనటి అమల

గచ్చిబౌలి: క్వీర్ స్వాభిమాన యాత్ర అకా హైదరాబాద్ ప్రైడ్ వాక్ క్వీర్ కార్నివాల్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి క్వీర్ వ్యక్తులు సామూహిక వేడుకను నిర్వహించారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో క్వీర్ వ్యవస్థాపకులు, రచయితలు, ప్రదర్శకులు తమ ప్రతిభను చాటేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీనటి అమల విచ్చేశారు. క్వీర్ స్వాభిమాన్ యాత్ర (క్యూస్‌వై హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రైడ్ వాక్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో స్టాల్స్, ఆటలు, ప్రదర్శనలు, పుస్తకావిష్కరణ ఉంటుంది.